

# 14 స్వామి ద్రోహ కథ

"గవర్న్రాజు అసలు పేరు గవ్రాజు" అంటూ కథ ఆరంభించింది చిలక. ఆ దర్జా. ఆ వైభోగం. విదానం అవీ చూచి 'నువ్వు గవర్నరు కావాల్సిన వాడివీ నీకు పనేందుకులే' అని అంటూ గవర్న్రాజని ముద్దుగా పిలుచుకునేవారు మిత్రులు. రాజు మేనమావ కాంగ్రెసోద్యమంలో ఖైదు కెళ్ళొచ్చి దరిమిలాను చనిపోయాడు. కీర్తీ, వారసత్వం కలిసొచ్చింది గదా అని రాజు కొన్నాళ్ళు బద్ధకించాడు. ఆ తరవాత డబ్బు అయిపోరావడం చూసి, జనం చిన్నచూపు చూడ్డం చూసీ మేలుకున్నాడు. చకచక డబ్బు గడించాలని నిశ్చయించుకున్నాడు. వయస్సు మీద పడుతూంది. తొందరపడాలనుకున్నాడు.

అతగాని జతగాడు కణ్ణన్ కూడా ప్రోత్సహించాడు. కణ్ణన్ చిన్ననాడే పొట్ట చేత బట్టుకు ఈ దేశం వచ్చి స్థిరపడి హోటేలు, బట్టలకొట్టు, పళ్ళ దుకాణం పెట్టి గట్టివాడయ్యాడు. రాజు సాయం పొందిన విశ్వాసం కొద్దీ డబ్బు సాయం చేస్తాను పట్టమన్నాడు. సయ్యంటే సయ్యని రాజు రంగంలోకి దిగాడు. టైమాట్టే లేనందువల్ల రాజనీతిలో ఉండాల్సిన నిదానం గట్రా తీసవతల పారేసి చురుగ్గా పనులు చక్క పెట్టసాగాడు. సెట్ లాటలో పేకముక్కలు పారేసి గడిగడికీ కొత్త సెట్‌లు కట్టుకునేవాడిలా మనుషుల్నీ, గ్రూపుల్నీ, పార్టీల్నీ ఫిరాయించాడు. పట్టు విడుపుల ఒడుపులు తెలిసిన వాడైనందువల్ల ఎబ్బెట్టుగా కనపడకుండానే నెట్టుకొచ్చాడు. మొత్తానికి ఏడాది తిరిగేసరికి బూర్లెబుట్టలాటి పదవిలో పడ్డాడు. 'అయుర్దాయం' ఏడాది రెండేళ్ళకన్నా ఉండదని అతనికి ఆశ్రయం ఇచ్చినాయన ముందే హెచ్చరించాడు. ఆ కొద్దికాలంలోనే రాజు తనని మొదట్లో ఆదుకున్న మిత్రుడు కణ్ణన్ ఋణం తీర్చుకున్నాడు. అపైన తాను సేకరించిన తృణం ఫణం లక్షపై చిలుకు కూడా కణ్ణన్ దగ్గరే అట్టే పెట్టాడు. బ్యాంకులో వేయడానికిగాని, ఇంట్లో దాచుకుందుగ్గాని మనసొప్పక 'నీకన్నా నాకెవరున్నారణ్ణా. కణ్ణా' అని కణ్ణన్ దగ్గరే దాచబెట్టాడు. నేను దిగొచ్చాక తీసుకుంటానన్నాడు.

తీరా రాజు గద్దెదిగి తాళ్ళూ పీచులూ తెంపుకొని, బట్టలు మార్చుకుని కణ్ణన్ దగ్గరకొచ్చి "నా డబ్బేది బ్రదర్" అనేసరికి కణ్ణన్ 'నీడబ్బేవి'టన్నాడు.

గొల్లుమన్నాడు రాజు. కణ్ణన్ అప్పటికే లక్షాధికారి. ఇది లేకపోతే గడవదని కాదుకాని, రాజు తన దగ్గర దాచిందే లక్షుంటే తనకు తెలీకుండా దాచింది ఇం'కోటి' ఉండదా అన్న ధీమా కొద్దీ, నేను చేసిన సాయానికి ఆ పాటి ఇవ్వచ్చుగా అన్న భావం కొద్దీ ఆ డబ్బుని ఏదో వ్యాపారంలోకి మళ్ళించాడు.

రాజు గొల్లుమన్నాడు నిశ్శబ్దంగా.

"నాకు తెలీదు. నా దగ్గర నీది ఎర్రని ఏగానీ కూడా లే"దన్నాడు కణ్ణన్.

"ఆ మాట ప్రమాణం చేసి చెప్పు" అన్నాడు రాజు.

"పద అలాగే చేద్దాం" అని భజన మందిరానికి తీసుకెళ్ళాడు కణ్ణన్.

విజయసాధనలో, ధన సాధనలో దేవుడు తురుఫాసు లాంటి వాడన్న సత్యం పొలిటీషియన్లకన్నా కణ్ణన్‌కే బాగా తెలుసు. అందుకే అతను ఊళ్ళో తనకున్న రెండు పెద్ద వ్యాపార కేంద్రాల్లోనూ, ఇద్దరు దేవుళ్ళను మేంటేన్ చేస్తున్నాడు. ప్రతి నిత్యం తెల్లవారుజామున, రాత్రివేళ భజన చెయ్యడానికి కిరాయి బృందాలు పెట్టాడు. స్వామి నమ్మినబంటులా, ఎంతో స్వామిభక్తి చూపి కణ్ణన్‌ని ఆదుకుంటున్నాడు.

ఆ రాత్రి భజన అయి అంతా వెళ్ళిపోయాక కణ్ణన్ రాజుని తీసుకొని అందులో కెళ్ళి నాలుగు చేతుల దేవుని సాక్షిగా "నీ డబ్బు నా దగ్గర ఏమీ లేదు" అని ప్రమాణం చేశాడు. రాజు తన చేతికిచ్చింది రాజు డబ్బు అని కణ్ణన్ అభిప్రాయపడలేదు. అది ప్రజల డబ్బు!

రాజు, ఈ ప్రమాణం చూసి కొయ్యబారిపోయాడు. గుడ్ల నీరు కక్కుకుని తలవంచుకుని, "బాగుపడు కణ్ణా. బాగుపడు" అని వెళ్ళిపోయాడు.

రాజు వెళ్ళగానే కణ్ణన్ తృప్తిగా నిట్టూర్చి దేవుడికేసి లాలనగా చూశాడు. చూసి కెవ్వుమన్నాడు.

నాలుగు చేతుల దేవుడి నాలుగు చేతులూ రివాజైన చోట లేవు. విగ్రహం రెండు చేతులతో చెవులూ, మిగతా రెండు చేతులతో కళ్లు మూసుకున్నట్టుంది.

కణ్ణన్ గుండె ఆగిపోయింది. విగ్రహం మారిందో, తన కళ్ళు భ్రమపడుతున్నాయో తెలీలేదు. తలుపులు గడియ వేసి దగ్గరకు వెళ్ళి తడిమి చూసాడు. నిజంగానే బొమ్మ మారిపోయింది.

కెవ్వున కేకవేసి తలుపులు తీసి బయటికి పరుగెత్తాడు కణ్ణన్. తన గదిలోకి వెళ్ళి మంచంమీద పడిపోయాడు. ముచ్చెమటలు పోశాయి.

భజన మందిరం తలుపులు తీసి ఉన్నాయి. ఎవరన్నా చూస్తే...? ఇప్పుడు కాకపోయినా తెల్లారగట్ల భజనకొస్తారు జనం, అప్పుడేనా చూడక మానరు. ఈ విడ్డూరం ఏమిటని గొడవ చేస్తారు. ఆ ఛాన్సు తీసుకొని రాజు తను మునిగినా సరేనని పబ్లిగ్గా తన డబ్బు దండుకొందుకొస్తాడు. డబ్బు, ప్రతిష్ట, వ్యాపారం, పలుకుబడి అన్నీ పోతాయి.

వ్యాపారదక్షుడు కణ్ణన్ స్థిమితంగా ఆలోచించాడు. తన ఇనప్పెట్టె గదిలో ఇంకో దేవుడి విగ్రహం ఉంది. అచ్చు మందిరంలో విగ్రహం లాంటిదే. లేచి ఆ విగ్రహం తీసుకొని మేడదిగి మందిరంలోకి వెళ్ళాడు. ఆ విగ్రహం తీసి ఈ విగ్రహం ప్రతిష్ఠించాడు. పువ్వులూ గట్రా యథాప్రకారం సర్దాడు. పాతబొమ్మ పట్టుకుని పైకి

బయల్దేరాడు. అంతలో ఇంకో ఆలోచన వచ్చింది. ఆ బొమ్మ పట్టుకుని ఊరి శివారుకు వెళ్ళాడు.

ఉదయం ఎనిమిది కొట్టేసరికి ఊరి శివారున వేలాదిగా జనం కూడారు. అక్కడ కలియుగ దైవం వెలిశాడని తెలిసింది. ఈ యుగం మీద, ఈ జనం మీద, ఈ కలికాలపు బుద్ధుల మీద, వ్యాఖ్య చేస్తున్నట్టుందిట విగ్రహం. రెండు కళ్ళూ రెండు చేతుల్తో, రెండు చెవులూ రెండు చేతుల్తో మూసుకున్నట్టుందిట. ఆహా! సాక్షాత్ భగవంతుడే దిగి వచ్చాడు.

భక్తాగ్రగణ్యుడు కణ్ణన్ గారికి కలలో కనబడి ఫలానా చోట వెలిశాను. వచ్చి కొలుచుకో అన్నాడుట... అబ్బే ఆయన అదృష్టమే కాదు, అసలు బొమ్మంతా ఆయన భజన మందిరంలో ఉన్న విగ్రహాన్ని పోలి ఉందట. అందుకే ఆయనకి దర్శనం ఇచ్చి ఉంటాడు.

కణ్ణన్‌గారు చాల హడావుడిగా ఉన్నారు. పది గంటలయ్యే సరికి ఆ దేవుడికి పైన నీడ కల్పించారు. గుడి ఎదురుగా అటో ఆరు ఇటో ఆరు దుకాణాలు ఆయనే తెరిపించాడు. దూరంగా భక్తుల సౌకర్యార్థం హోటలు తెరిచారు. అన్నీ స్వంత ఖర్చుల మీదేనుట.

ఆర్నెల్లు తిరిగేసరికి అక్కడ మంచి దేవాలయం కణ్ణన్‌గారి మేడకింకో అంతస్తూ లేచాయి.

గవర్నరాజుకి పిచ్చెక్కి, గావుకేక వేసి వీధులెంట తిరిగి, చివాట్లూ, చెప్పుదెబ్బలూ తిని, పిచ్చాసుపత్రిలో వేస్తారన్న బెదిరింపుతో నోరు మూసుకుని ప్రజల్లో కలిసిపోయాడు.

"చిన్నారావూ, దేవుడికి ఇందులో తిరకాసంతా తెలుసు కదా? మరి కణ్ణన్ని ఎందుకు బలపరచాడూ? గవర్నరాజు నెందుకు దండించాడు? చెప్పు" అంది చిలక కథ ముగించి.

"కణ్ణన్ ఎలాగా అబద్ధమాడతాడని తెలిసుండి కూడా వాణ్ణి తన ఎదుటికి లాక్కొచ్చి ప్రమాణం చేయించి, తన్ను సాక్ష్యం వేయించాలని రాజు కుట్ర పన్నాడు. అంచేత రాజు మీదే కోపం వచ్చింది దేవుడికి. అదీగాక ఈ జన్మకిలా పోనిచ్చినా పక్క జన్మలో కణ్ణన్‌ని బీదవాడుగా పుట్టించి, అప్పుడు వాడి పని పడతాడనుకుంటా" అన్నాడు చిన్నారావు.

☆ ☆ ☆

"సుబ్బరాజూ, ఆ చిలక్కి కథ సరిగ్గా చెప్పడం రాదు గాని, నువ్వు చెప్పు చూద్దాం. ఈ కథలో స్వామిద్రోహి ఎవరు?" అన్నాడు రామిరెడ్డిగారు.

"దేవుడు" అన్నాడు సుబ్బరాజు.

"అయితే, సాక్షికం వేళ ఎదురు తిరగబోయాడు గాని అంతలోనే సర్దుకున్నాడు తెలివిగా" అన్నాడు ఇంకో క్షణం ఆగి.

"ఇంతకీ చిలక చెబుతానన్న అసలు కథ చెప్పారు కాదే – అంత కింతా, ఇంత కెంతా అనేదీ?" అన్నాడు ఇంకో క్షణం ఆగి.

"ఇంకో క్షణం ఆగు చెబుతా" అన్నారు రెడ్డిగారు.

★ ★ ★